క్లుప్తంగా...

నాగారం కమిషనర్‌గా రాజేంద్రకుమార్



కీసర: నాగారం మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా జి.రాజేంద్ర కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు గూడూరు ఆంజనేయులు, మున్సిపల్ అధికారులు బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కమిషనర్‌గా వేమనరెడ్డి



పోచారం: పోచారం పురపాలక సంఘ కమిషనర్‌గా పి.వేమనరెడ్డి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన సురేష్ రామచంద్రాపురం బదిలీపై వెళ్లారు. ఘట్‌కేసర్ పురపాలక సంఘ కమిషనర్‌గా పనిచేస్తున్న వేమనరెడ్డి పోచారానికి బదిలీపై వచ్చారు. పాలకమండలితో పాటు పలువురు నాయకులు ఆయనను శాలువాలతో సత్కరించి స్వాగతించారు.

కార్మికుల డిమాండ్లపై స్పందించాలి

ఘట్‌కేసర్: గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది చేపట్టిన సమ్మెకు ఆయన బుధవారం సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెక్కాడితే డొక్కాడని కార్మికులు 14 రోజులుగా సమ్మెలో ఉంటే వారిని పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్మికులు, జేఏసీ నాయకులను పిలిచి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు జయచంద్ర, ఈశ్వర్, గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

కులవృత్తుల వారికి లక్ష రుణం ఇవ్వాలి



ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: రుణం కోసం దరఖాస్తు చేసుకున్న కులవృత్తుల వారందరికీ రూ.లక్ష రుణం అందించాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి బుధవారం మాట్లాడుతూ అధికారపక్ష కార్యకర్తలకే బీసీ రుణం అందజేస్తామని నాయకులు సామాన్యులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, అర్హులందరికీ బీసీ రుణం అందజేయాలని కలెక్టర్‌కు వినతి అందించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికే రుణం అందజేయడం సమంజసం కాదని, కులవృత్తుల వారికి రుణం ఇవ్వాలని కోరారు.

డీఆర్ఓగా జేఎల్‌బీ హరిప్రియ

సాక్షి, మేడ్చల్ జిల్లా: జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్ఓ)గా జేఎల్‌బీ హరిప్రియ నియమితులయ్యారు. రంగారెడ్డి జిల్లాలో ఎస్‌జీడీసీ హోదాలో యూఎల్‌సీ అధికారిగా పనిచేస్తున్న హరిప్రియను పదోన్నతిపై మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా డీఆర్ఓగా నియమిస్తూ.. బుధవారం రెవెన్యూ శాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. గురు లేదా శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారిగా హరిప్రియ బాధ్యతలు స్వీకరించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ జిల్లాలో డీఆర్ఓగా పని చేసిన లింగ్యానాయక్ పదోన్నతిపై వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా బదిలీ అయిన విషయం తెలిసిందే.. అలాగే, నాగర్‌కర్నూల్ ఆర్డీఓగా ఎస్‌డీసీ హోదాలో పనిచేస్తున్న టీపీవీ నాగలక్ష్మీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిశ్రమల శాఖ భూసేకరణ(రెవెన్యూ) అధికారిగా బదిలీపై వస్తున్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న కమిషనర్

బోడుప్పల్: త్వరలో నిర్వహించే హరితహారానికి నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నట్లు బోడుప్పల్ నగర పాలక సంస్థ కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం లక్ష్మీనగర్, ఎస్ఐఎస్ కాలనీ, మణికంఠ కాలనీ నర్సరీ, పార్కులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల్లో కలుపు లేకుండా చూడాలని హరిత మిత్రలను ఆదేశించారు. త్వరలోనే హరితహారం చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

సడక్‌పై దడదడ



అత్వెల్లి రహదారి దుస్థితి

- గ్రేటర్ శివారు ప్రాంతాల్లో చిత్తడే.. చిత్తడి
- పట్టణాలు, గ్రామాల్లో పరిస్థితి అధ్వాన్నం
- వర్షాలతో ఛిద్రమైన రోడ్లు, నాలాలు
- పలు చెరువులు, నాలాల కబ్జాతో లోతట్టు కాలనీల్లోకి చేరుతున్న వరద

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారు పట్టణాలు, గ్రామాల్లో వాన జల్లులతో రోడ్లు అస్తవ్యస్తంగా మారిపోయి గుంతలమయం కాగా, లోతట్టు కాలనీల్లోకి వరద చేరుతోంది. పలుచోట్ల డ్రైనేజీలు కాల్వలు కూడా దెబ్బతిన్నాయి. దీంతో బస్తీ, పల్లెవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని పలు రోడ్లు కూడా దెబ్బతిన్నాయి.

- ఉప్పల్ నుంచి వరంగల్ జాతీయ రహదారిలోని మేడిపల్లి నుంచి అన్నోజిగూడ బ్రిడ్జి వరకు జాప్యంగా సాగుతున్న రోడ్డు విస్తరణ పనుల కారణంగా రోడ్లపై వరద నీరు నిలిచిపోవడంతోపాటు గంటల తరబడి ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు, స్థానికులు, వ్యాపారవర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- చౌదరిగూడ, ప్రతాపసింగారం, కొర్రెముల, కాచవాని సింగారంలోని అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయి.
- నాగారం నుంచి కీసర ప్రధాన రోడ్డులో అప్పుడప్పుడూ కురుస్తున్న వర్షపు జల్లులతో వరద నీరు పారుతుండటంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.
- రాంపల్లి నుంచి బోగారం ప్రధాన రోడ్డు అధ్వాన్నంగా మారింది. పెద్దఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. రాంపల్లి నుంచి చర్లపల్లి ప్రధాన రోడ్డు పూర్తిగా ఛిద్రమైపోయింది.
- గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీ కాలనీ సహా పలు కాలనీల్లో రోడ్లన్నీ ఛిద్రంగా మారడంతో.. పట్టణ ప్రజలు పలు కష్టాలను ఎదుర్కొంటున్నారు.
- బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సాయినగర్, మల్లన్ననగర్, చెంగిచర్ల తదితర కాలనీల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. జవహర్‌నగర్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, దుండిగల్, ఘట్‌కేసర్, తూముకుంట, నిజాంపేట్ పురపాలక సంఘాల్లోని పలు కాలనీల్లో కూడా రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, నాలాలు వర్షాల కారణంగా దెబ్బతిన్నాయి. కీసర, శామీర్‌పేట్ మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు పలు గ్రామాల్లో వర్షంతో రోడ్లు దెబ్బతినగా, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం సహాయక చర్యలకు ఆదేశించగా, అప్రమత్తమైన పురపాలక, పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది రంగంలోకి దిగి మరమ్మతులు చేపడుతోంది.

నిధులు విడుదలైనా..

- బోడుప్పల్, పీర్జాదిగూడ పురపాలక సంఘాల్లో గతంలో భారీగా కురిసిన వర్షాలతో తొమ్మిది కిలో మీటర్ల రోడ్డు పూర్తిగా దెబ్బతినగా.. డ్రైనేజీ కాల్వలతో సహా రోడ్ల పనులకు ప్రభుత్వం 18 నెలల క్రితం రూ.110 కోట్లు విడుదల చేయగా, సంబంధిత పురపాలక సంఘాలు నామమాత్రంగా పనులకు శ్రీకారం చుట్టడంతో పరిస్థితి ఎప్పటిలాగే ఉండగా, రోడ్లన్నీ ఛిద్రంగా మారాయి. దీంతో స్థానిక ప్రజలు, ముఖ్యంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. మేడ్చల్ జిల్లాలోని పలు పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో కూడా ఇదే అధ్వాన్న పరిస్థితి దాపురించింది.
- జిల్లాలోని పలు చెరువులు, కుంటలు, నాలాలకు సంబంధించిన స్థలాలు కబ్జాకు గురికావడంతో.. చిన్నపాటి వర్షాలకు కూడా సమీపంలోని కాలనీలు, లోతట్టు ప్రాంతాలు, రోడ్లు వరదమయంగా మారుతున్నాయి. చెరువులు, నాలాల్లోని అక్రమ నిర్మాణాల కారణంగా నాగారం, దమ్మాయిగూడ, జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ పురపాలక సంఘాల్లోని పలు కాలనీల్లో రోడ్లు అధ్వాన్నంగా మారిపోయాయి. చెంగిచర్ల బస్సు డిపో వద్ద ఉన్న చెరువు కట్టను ధ్వంసం చేసి.. బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించడంతో సమీపంలోని కాలనీల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



నారపల్లిలో..



నాగారం-దమ్మాయిగూడ రోడ్డులో..

రామలింగేశ్వరస్వామి సేవలో అడిషనల్ కలెక్టర్



కీసరగుట్ట స్వామి సేవలో జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

కీసర: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన విజయేందర్‌రెడ్డి బుధవారం కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి సేవలో పాల్గొన్నారు. కీసరగుట్ట దేవాలయానికి విచ్చేసిన జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి కీసరగుట్ట వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారి ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు అడిషనల్ కలెక్టర్‌కు స్వామివారి ఆశీర్వచనంతో పాటు మహాప్రసాదాన్ని అందజేశారు. కీసర ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన రాజేష్‌కుమార్ కూడా స్వామిసేవలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ, ట్రస్టు బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు



కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌గా పని చేసి బదిలీపై వెళ్లిన స్వామికి బుధవారం దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌గా స్వామి సేవలను గుర్తుచేసుకున్నారు.

దేశంలో అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే..

మంత్రి మల్లారెడ్డి



మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నీరజ్‌గౌడ్

శామీర్‌పేట్: రాష్ట్రంతో పాటు దేశంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి మండలంలోని కేశవాపూర్, మూడుచింతలపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మూడుచింతలపల్లి మండల యూత్ అధ్యక్షుడు నీరజ్‌గౌడ్, పలువురు కార్యకర్తలు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, ఎంపీపీ హారిక, పార్టీ మండల అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి అనిల్‌రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో సెల్‌ఫోన్ నిందితుడు

ఘట్‌కేసర్: జేబులో నుంచి సెల్‌ఫోన్‌ను చోరీ చేసిన నిందితుడిని ప్రయాణికులు, స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ప్రయాణికులు, స్థానికుల వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన సంపంగి రవి(28) కూలీ పనులు చేసుకుంటూ ఉప్పల్‌లో నివాసం ఉంటున్నాడు. జల్సాలకు అలవాటుపడి డబ్బుల కోసం చోరీలు చేస్తున్నాడు. బుధవారం ఉదయం ఘట్‌కేసర్ బస్టాండ్‌లో ఓ ప్రయాణికుడి జేబులో నుంచి సెల్‌ఫోన్ చోరీ చేసి పరిగెత్తుతుండగా తోటి ప్రయాణికులు, స్థానికులు అతడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. పోలీసులకు సమాచారం అందించడంతో రవిని అదుపులోకి తీసుకున్నారు. అతడిపై ఇప్పటికే పలు పోలీస్ స్టేషన్లలో సుమారు 15 కేసులు ఉన్నట్లు సమాచారం. రవిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నారు.

బాధ్యతలు స్వీకరించిన జిల్లా అదనపు కలెక్టర్



సాక్షి, మేడ్చల్‌జిల్లా: మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా విజయేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా విధులు నిర్వర్తించిన ఏనుగు నర్సింహరెడ్డి హైదరాబాద్ జిల్లాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో గజ్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీవో)గా విధులు నిర్వర్తించిన విజయేందర్‌రెడ్డి పదోన్నతిపై మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా నియమితులయ్యారు. కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహరెడ్డి, ఇన్‌చార్జ్ డీఆర్ఓ చంద్రావతి, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, పలువురు తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

మేడిపల్లి: రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. బంగ్లాదేశ్ పర్యటనలో ఉన్న మేయర్ కార్పొరేషన్ పరిధిలో పరిస్థితులపై చర్చించారు. బుధవారం రాత్రి భారీ వర్షం కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని మేయర్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మున్సిపల్ అధికారులకు, స్థానిక కార్పొరేటర్లకు సమాచారం అందించాలని మేయర్ సూచించారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో మంత్రి మల్లారెడ్డి

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. 3వ డివిజన్‌లోని కృష్ణనగర్‌లో రూ.33.50 లక్షలతో డ్రైనేజీ పనులకు, 24వ డివిజన్‌లో రూ.40 లక్షల వ్యయంతో వీరారెడ్డినగర్ చౌరస్తా, అంబేడ్కర్‌నగర్ చౌరస్తా వరకు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ బోడుప్పల్ నగర పాలక సంస్థలో మౌలిక వసతులైన రోడ్లు, తాగునీరు, భూగర్భ డ్రైనేజీ, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రధాన రహదారులకు నిధులు కేటాయించి వాటి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ సామల బుచ్చిరెడ్డి, కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ రెడ్డి, కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, గుర్రాల రమ వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ స్టడీటూర్‌కు మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: స్టడీటూర్‌లో భాగంగా పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణితో కలిసి బుధవారం ఉదయం బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఏఎస్‌సీఐ) ఆధ్వర్యంలో స్వచ్ఛసర్వేక్షణ్‌పై ఈ నెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు స్టడీటూర్‌లో భాగంగా బంగ్లాదేశ్‌లోని వివిధ పట్టణాల్లో మేయర్ పర్యటించనున్నారు. నాలుగు రోజుల స్టడీటూర్ ముగిసిన అనంతరం మేయర్ ప్రజలకు అందుబాటులో ఉంటారని మేయర్ వెంకట్‌రెడ్డి కార్యాలయ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

కార్మికులకు అండగా ఉంటా

మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి



బీఆర్‌టీయూ జెండా ఆవిష్కరిస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: కంపెనీల్లో పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వారికి అండగా ఉంటానని మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మయోర ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో బుధవారం బీఆర్‌టీయూ జెండా ఆవిష్కరణలో పాల్గొని యూనియన్ అధ్యక్షుల హోదాలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీలోని కార్మికుల హక్కులను బీఆర్‌టీయూ తరపున పోరాటం చేసి సాధించి కార్మికులకు అందేలా చేస్తానన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యాలు సహకారం అందించాలని కోరారు. బీఆర్‌టీయూ ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలిచి వారి సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. కంపెనీలో యూనియన్ ఏర్పాటుకు కృషి చేసిన కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, కంపెనీ యూనియన్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులు మల్లేశ్, మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్ రావు, మహేశ్, అమెన్, నాయకులు నరసింహచారి, శేషాద్రి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్ల బాధితుల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న ప్లాట్ల బాధితులు

జవహర్‌నగర్: తమకు న్యాయం జరిగే వరకు చావడానికైనా సిద్ధమని జవహర్‌నగర్ కేసీఆర్ కూరగాయల మార్కెట్ స్థలం ప్లాట్ల బాధితులు డిమాండ్ చేశారు. బుధవారం జవహర్‌నగర్‌లో ప్లాట్ల బాధితులు ప్రధాన రహదారిపై అర్ధనగ్నంగా కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. తాము కొనుగోలు చేసిన స్థలంలో నాయకులు మార్కెట్ పెట్టారని, మంత్రి మల్లారెడ్డి తమకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని, లేదంటే చావడానికైనా సిద్ధమని వారు తెలిపారు. కార్యక్రమంలో నర్సింహయాదవ్, ఆనంద్, ప్లాట్ల బాధితులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల్‌లో అదనపు పనుల పరిశీలన

ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల్ జూనియర్ కళాశాల అదనపు గదుల పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, జెడ్పీ ఏఈ జగపతితో బుధవారం పరిశీలించారు. వైస్ చైర్మన్ మాట్లాడుతూ అదనపు గదులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. కార్యక్రమంలో గురుకుల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, హెచ్ఎం రజని, కోఆప్షన్ సభ్యుడు షౌకత్, అయూబ్, నజీర్, నవీన్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



గురుకుల్‌లో అదనపు గదులను పరిశీలిస్తున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి, ఏఈ జగపతి

ఈడబ్ల్యూఎస్ కాలనీలోని ఇళ్లను క్రమబద్ధీకరించాలి



కలెక్టర్ కార్యాలయంలో వినతి అందజేస్తున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి

ఘట్‌కేసర్: పట్టణంలోని ఈడబ్ల్యూఎస్ కాలనీలోని ఇళ్లను క్రమబద్ధీకరించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. కాలనీలో నివసించే వారు నిరుపేదలు అయినందున ఇళ్లను క్రమబద్ధీకరించాలని లేఖలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు షౌకత్, నజీర్, నవీన్, ప్రణయ్‌రెడ్డి, సిరాజ్ పాల్గొన్నారు.

చౌదరిగూడలో ఇంటింటికీ కాంగ్రెస్



ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమంలో సింధుజ, రుక్‌వర్ధన్‌రెడ్డి, వినోద్ తదితరులు

ఘట్‌కేసర్: చౌదరిగూడలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా యూత్ కాంగ్రెస్ నేషనల్ కో ఆర్డినేటర్, తమిళనాడు కార్యదర్శి సింధుజ, తెలంగాణ యూత్ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి రుక్‌వర్ధన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి క్రాంతిగౌడ్ హాజరయ్యారు. ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీ గతంలో చేపట్టిన అభివృద్ధి పనులు, రాబోయే రోజుల్లో చేపట్టనున్న పనులపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులకు రూ.4 వేల పెన్షన్, మహిళలకు ఉచిత బస్ రవాణా సౌకర్యం, రూ.500లకు గ్యాస్ సిలిండర్, అమరవీరులకు రూ.15 వేల ఆర్థిక సాయం, కౌలు రైతులకు రూ.15 అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, చౌదరిగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, వార్డు సభ్యులు భోజిరెడ్డి, మాజీ సభ్యుడు నర్సింగ్‌రావుముదిరాజ్, దావిద్‌రెడ్డి పాల్గొన్నారు.

మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి



జవహర్‌నగర్‌లో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జవహర్‌నగర్: వచ్చేనెల నగరంలో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కో–కన్వీనర్ వడ్డేపల్లి శివకుమార్‌మాదిగ అన్నారు. బుధవారం జవహర్‌నగర్‌లోని దళిత భవనంలో మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. మహాసభలో భాగంగా ఘట్‌కేసర్‌లో ఈ నెల 21న సన్నాహక సదస్సు నిర్వహిస్తున్నట్లు, మాదిగ యువకులు, విద్యార్థులు స్వచ్ఛందంగా హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జవహర్‌నగర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కొయ్యడ వెంకటేష్‌మాదిగ, నాయకులు చుక్క ఐలయ్య, బూడిద వెంకటేష్, మొగిలిపాక వెంకటేష్, చిలుముల్ల మల్లేష్, మాట్ల శ్రీను, క్రాంతికుమార్, యాదగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

571 ఎకరాల భూమిని కాజేసేందుకు కుట్ర



వ్యవసాయ భూమి పాస్ పుస్తకాలను చూపిస్తున్న బాధితులు

బొమ్మరాశిపేట ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

పంజగుట్ట: ధరణిలోని లోపాలను ఉపయోగించుకుని తమ గ్రామానికి చెందిన 571 ఎకరాల భూమిని కాజేసేందుకు కుట్ర జరుగుతోందని శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేట ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆరోపించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణలోనూ తమ పేరుట పాస్ పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. తమ పేరుపై రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉన్నా రైతుబంధు, రైతుబీమా వస్తున్నా.. భూమి తమదంటూ కొందరు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వెల్లడించారు. బొమ్మరాశిపేట ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రాంచందర్, బాధితులు సంధ్య, పావని మాట్లాడారు. తమ గ్రామంలోని 300 మంది చిన్న, సన్నకారు రైతులకు చెందిన సుమారు 550 ఎకరాల స్థలాన్ని కొంతమంది కాజేసేందుకు చూస్తున్నారని తెలిపారు. 50 ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్న, 1960లోనే వారి పూర్వీకులు అమ్మేసిన భూమికి కొన్ని పాత డాక్యుమెంట్లు సృష్టించి, మ్యుటేషన్ దరఖాస్తులు దాఖలు చేస్తున్నారని వెల్లడించారు. తమను పార్టీలుగా చేర్చకుండానే సదరు భూములపై కేసులు వేస్తున్నారన్నారు. కేసులను ఆధారంగా చూపుతూ రికార్డుల్లో తమ పేరును తొలగించి వారికి మ్యుటేషన్ చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు ధరణిలోని లోపాలను అడ్డుపెట్టుకుని, రెవెన్యూ అధికారుల అండదండలతో ఇదంతా చేస్తున్నారని వారు ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.